www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 23 మే 2025
5
వైఎస్ఆర్

పులివెందులలో నేడు విద్యుత్ అదాలత్ : డిఇఇ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణ పరిధిలో విద్యుత్ సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఆ శాఖ డిఇఇ గురుమోహన్‌రెడ్డి ఒక ప్రక టనలో తెలిపారు. అంబకపల్లె రోడ్డులోని సబ్ స్టేషన్‌లో ఉన్న విద్యుత్ భవన్‌లో శుక్రవారం విద్యుత్ అదాలత్, అవేర్నెస్ ప్రోగ్రాం ఏర్పాటు చేస్తామన్నారు. వినియోగదారులకు ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉన్నా తెలియజేస్తే పరిష్కరిస్తామన్నారు. ఈ సదవకాశాన్ని పులివెందుల పట్టణ, గ్రామీణ, లింగాల మండల ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.

బదిలీల సహాయ కేంద్రం ఏర్పాటు : యుటిఎఫ్

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

ప్రజాశక్తి- కడప అర్బన్

ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి కడప యుటిఎఫ్ భవన్‌లో సహాయ కేంద్రం ఏర్పాటు చేసినట్లు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు తెలిపారు. గురువారం యుటిఎఫ్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఉపాధ్యాయ బదిలీల చట్టాన్ని తీసుకొచ్చి మొదటిసారిగా బదిలీలు నిర్వహిస్తుందని చెప్పారు. ఇందుకు సంబంధించిన ఏవైనా సమస్యలు, ఆన్‌లైన్‌లో దరఖాస్తు, బదిలీల ప్రక్రియలో తలెత్తే సమస్యలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించడానికి సహకార కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బదిలీలకు అర్హత కలిగిన ఉపాధ్యాయులందరూ ఇబ్బందులకు గురికాకుండా వారికి మార్గదర్శకత్వం అందించే విధంగా బదిలీల ప్రక్రియ ముగిసే వరకు యుటిఎఫ్ భవన్‌లో సహకార కేంద్రాన్ని నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయులందరూ అవకాశాన్ని ఉపయోగించుకుని బదిలీలలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్త వహించగలరని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఏజాస్ అహమ్మద్, జిల్లా కార్యవర్గ సభ్యులు గోపీనాథ్, ప్రకాష్ బాబు, విజయచంద్రారెడ్డి, గంగన్న, మహబూబ్ బాషా, శివప్రసాద్, ప్రభాకర్, నరసింహులు పాల్గొన్నారు.

మధుర గీతాల సామ్రాట్ వేటూరి

- ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి

వేటూరి సుందరరామూర్తి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కవులు, రచయితలు

ప్రజాశక్తి - కడప అర్బన్

వేటూరి సుందర రామమూర్తి దివి నుంచి భువికేగినా ఆయన పాటలు అజరామరాలని, నిత్యం తెలుగువారి నాలుకలపై సుస్వరాలని, ఇటు క్లాస్ అటు మాస్ పాటలతో పాటు శృంగార గీతాలు రాయడంలో ఆయన సామ్రాట్ అని వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. రచయితల సంఘం ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం కార్యాలయంలో వేటూరి సుందర రామమూర్తి 15వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మొదట ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ 'ఓ సీత కథ' సినిమాతో ప్రారంభించి కొన్ని వందల సినిమాల్లో దాదాపు తొమ్మిది వేల పైగా పాటలు రాశారని, శంకరాభరణం, సాగర సంగమం, సప్తపది వంటి సినిమాల్లో రాసిన సంప్రదాయ పాటలతో పాటు అడవి రాముడు, జగదేకవీరుడు- అతిలోకసుందరి వంటి వందల సినిమాల్లో శృంగార భరితమైన పాటలు రాశారని, శ్రీ శ్రీ తరువాత తెలుగు పాటకు అంతర్జాతీయ కీర్తినార్జించినది సుందర రామమూర్తి అన్నారు. కవి డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ వేటూరి వారు సీనియర్ ఎన్టీఆర్ మొదలుకుని నాగేశ్వరరావు, కృష్ణ, శోభన్ బాబు, కృష్ణంరాజు, చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్ మొదలైన ఎంతోమంది నటుల కోసం ఆయన సూపర్ హిట్స్ అందించారని పేర్కొన్నారు. బద్రీనాథ్ సినిమాలో ఓంకారేశ్వరి అనే పాటలో 108 వైష్ణవ దివ్య స్థలాలను వ్యక్తపరచిన తీరు అద్భుతమని, ఆయన రాసిన పాటలు పండితుల నుంచి పామరుల వరకు అందరినీ అలరించి ఆనందపరిచాయని తెలిపారు. వేటూరి పాటలు తర్వాత తరాల వారికి కూడాఎంతో స్ఫూర్తిదాయకంగా నిలిచాయని చెప్పారు. కార్యక్రమంలో బ్యాంకు గంగయ్య, తుపాకుల నారాయణ, సివి కృష్ణయ్య, కె.వి.సుబ్బరాయుడు, కె.సి.పుల్లయ్య, సోము వెంకటసుబ్బయ్య, బి. రామమోహన్ రెడ్డి, ఎం.సుబ్బరాయుడు, జి. పుల్లయ్య, వర్మ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడటమే నిజమైన దేశభక్తి

- సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్

ప్రజాశక్తి కడప అర్బన్

ప్రజాస్వామ్యాన్ని కాపాడడమే నిజమైన దేశభక్తి అని, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ ప్రశ్నించారు. గురువారం సిపిఎం జిల్లా కార్యాలయంలో చంద్రారెడ్డి అధ్యక్షతన సిపిఎం కడప నగర కమిటీ విస్తృత సమావేశం నిర్వహించారు. దేశంలో మూడవ దఫా కొలువుదీరిన బిజెపి ప్రభుత్వం ప్రజల ఐక్యత, దేశ సమైక్యత, సమగ్రతలను గాలికి వదిలేసి ఓట్ల కోసం, మత విభజన రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఇది అత్యంత ప్రమాదకరమైన పరిస్థితులకు దారితీస్తుందని హెచ్చరించారు. టెర్రరిస్టులకు మతం ఉండదని, ఉన్మాదం మాత్రమే ఉంటుందని, కనీస జ్ఞానం లేకుండా టెర్రరిస్టులకు మతాన్ని అంటగట్టి దేశంలో ఓట్ల కోసం, కాషాయ మీడియా మత రాజకీయాలు ప్రేరేపిస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటమే నిజమైన దేశభక్తిని, పాలకులు గుర్తించే వరకు ప్రజలు సమైక్యంగా పోరాడాలన్నారు. జిల్లాలోని పులివెందుల నియోజకవర్గం, వేముల మండలం, తుమ్మలపల్లి యురేనియం ప్లాంటు వ్యర్థపదార్థాలు ప్రాణంతకంగా మారాయని, యురేనియం రేడియేషన్ నీటిలో, గాలిలో కలిసి ఆ ప్రాంతం భవిష్యత్తులో శ్మశానాన్ని తలపిస్తుందని స్థానిక ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని పేర్కొనాన్రు. జిల్లాలోని యురేనియం ప్లాంట్‌ను తరలిస్తామని మహానాడులో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం కడప నగర కార్యదర్శి ఎ.రామ్మోహన్, నగర కమిటీ సభ్యులు బి.దస్తగిరిరెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకటసుబ్బయ్య, లక్ష్మీదేవి, రవి, కిరణ్, నరసింహ, రామకృష్ణారెడ్డి, స్టీఫెన్, గోవిందు, వంశీ పాల్గొన్నారు.

యువ రచయితలకు దీపదారి 'కేతు'

కేతు విశ్వనాథరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రచయితలు

ప్రజాశక్తి - చాపాడు

ఆధునిక సాహితీ లోకంలో యువ రచయితలకు ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి దీపదారి అని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వ సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య పేర్కొన్నారు. మైదుకూరు జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో గురువారం కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, సాహిత్య విమర్శకులు, అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర పూర్వ అధ్యక్షులు ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి వర్ధంతి సభను ఏర్పాటు చేశారు. రచయిత, చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ తవ్వా మాట్లాడుతూ రచయితను దృష్టిలో ఉంచుకొని సాహిత్య విమర్శ చేయ కూడదని కేతు తనకు చెప్పేవారని గుర్తు చేశారు. సభాధ్యక్షుడు బొమ్మిశెట్టి రమేష్ మాట్లాడుతూ వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకొని రుజుమార్గంలో వాడుకొని తెలుగు భాషాభివృద్ధికి కేతు తన జీవితాన్ని ధారపోశారని తెలిపారు. కేతు కథలలో పీర్ల చావిడి అత్యంత ప్రచుర్యం పొందిందన్నారు. హిందీ, బెంగాలీ, మలయాళం, మరాఠీ, కన్నడ, ఇంగ్లీషు, రష్యన్ భాషల్లో అనువాదం పొందిన తెలుగు కథ కేతుదని తెలిపారు. కార్యక్రమంలో రాటా అధ్యక్షుడు కొండపల్లి శేషగిరి, విశ్రాంత ఉపాధ్యాయులు పొలిమేర ఓబన్న, రచయిత తోట రామ్మోహన్, సాహితీప్రియులు గోసుల వీర రాఘవరెడ్డి, డి.వెంకట రమణారెడ్డి, చిత్రకారుడు కైఫ్ బాలరాజు (బాలు), భాస్కర్, సురేష్ పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు

మాట్లాడుతున్న ఎస్‌పి విద్యా సాగర్ నాయుడు

- తాళం వేసిన ఇల్లే టార్గెట్
- రూ.కోటి విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్‌పి విద్యా సాగర్‌నాయుడు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాత్రిపూట తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా ముఠాను అరెస్టు చేసి వారి వద్దనుండి కోటి రూపాయలకు పైగా విలువ చేసే బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు అన్నారు. గురువారం జిల్లా పోలీసులు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇద్దరు యువకులు ఓ నేరచరిత్ర గల వ్యక్తితో కలిసి ఈ దొంగతనాల ముఠాను ఏర్పరచుకున్నారని చెప్పారు. గోదావరి జిల్లా లక్కవరానికి చెందిన తోట శివకుమార్, చిత్తూరు జిల్లా మొరవారిపల్లికు చెందిన జెట్టి సుబ్రమణ్యం, అన్నమయ్య జిల్లా, మాధవరంపాడుకు చెందిన నిందితుల నుంచి దాదాపు కోటి రూపాయలు విలువ చేసే కిలో బంగారం, రూ. 3 లక్షలు విలువ చేసే మూడు కిలోల వెండి, రూ.1.4 లక్షల నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, ఓ ఆటోను స్వాధీనం చేసుకున్నామనారు. వీరు గతంలో విజయవాడ, గుంటూరు, తాడేపల్లిగూడెం, అనకాపల్లి, రాజంపేట తదితర ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడి 150కిపైగా కేసుల్లో నిందితులుగా ఉన్నారని తెలిపారు. అన్నమయ్య జిల్లా, మున్నూరు పిఎస్‌లో నమోదయిన కేసులో ఈ నెల 21న తేదీన రాజంపేట మండలం, ఊటుకూరు వద్ద వీరిని అరెస్టు చేశామన్నారు. రాజమండ్రి జిల్లాలోని బొమ్మరులో ఒకటి, నక్కపల్లిలో ఒకటి, తిరుపతి జిల్లా లోని తిరుచానురులో 5, అన్నమయ్య జిల్లాలలోని పీలేరులో 2, రాయచోటిలో 1, రాజంపేటలో 2, ఒబులవారిపల్లి 1, మున్నూరు లో 4 కేసులకు సంబంధించి బంగారు, వెండిఆభరణాలు బయటపడ్డాయన్నారు. ఈ కేసును ఛేదించడంలో రాజంపేట సబ్ డివిజన్ ఎఎస్‌పి మనోజ్ రామనాథ్ హెగ్డే, మన్నూరు ఇన్‌స్పెక్టర్ కుళాయప్ప, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్‌ఐలు మహేష్, రామకృష్ణారెడ్డి కీలకంగా పనిచేసిన వారిని ఎస్‌పి అభినందించారు. ప్రజలు తమ ఇళ్ల పరిసర ప్రాంతాల్లో సిసి టివి ఏర్పాటు చేసుకవాలన్నారు. విలువైన వస్తువులు బ్యాంకు లాకర్‌లో భద్ర పరచుకోవాలన్నారు. అపరిచితుల కదలికలపై నిఘా, అనుమానం వచ్చిన వెంటనే డైల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సి ఐలు, ఎస్‌ఐలు, పోలీస్ కానిస్టేబుల్, సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధికి నిదర్శనం

బాలల వేసవి వినోదం

విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న జెవివి జిల్లా అధ్యక్షులు సమీర్ బాష

ప్రజాశక్తి- కడప అర్బన్

నైపుణ్యాభివృద్ధికి నిదర్శనం బాలల వేసవి వినోదం అని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు సమీర్ బాష పేర్కొన్నారు. గురువారం జెవివి ఆధ్వర్యంలో 'వేసవి వినోదం' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, ఓరిగామి, క్రీడలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు స్పోకెన్ ఇంగ్లీష్ తరగతుల్లో ప్రత్యేకంగా బేసిక్ కమ్యూనికేషన్ స్కిల్స్‌ను అభ్యసించాలని తెలిపారు. క్రాఫ్ట్, ఓరిగామి ద్వారా చేతి పనులకు ప్రోత్సాహం లభించిందని చెప్పారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ఆరోగ్యం లభిస్తుందని పేర్కొన్నారు. క్యాంపులో విద్యార్థులు ప్రదర్శిస్తున్న చురుకుదనం, శ్రద్ధ నిర్వాహకులను ఆకట్టుకుందని తెలిపారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, రిసోర్స్ పర్సన్స్ రంగనాయకులు, గఫూర్, కామేశ్వరమ్మ, నరసింహులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రద్ధ పెడితే గణితంలో మంచి మార్కులు

విద్యార్థులు కొంత శ్రద్ధ పెడితే గణితంలో మంచి మార్కులు సాధించవచ్చు గణిత ఉపాధ్యాయుడు తుంగ సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞానం తరగతుల్లో విద్యార్థులకు శులభ శైలిలో గణితం ఎలా నేర్చుకోవాలో నేర్పించారు. అన్నింటి కంటే గణితం సబ్జెక్ట్ సులభంగా అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఉదయం కథ సమయంలో విద్యార్థులతో కథలు చదివించారు. అనంతరం విద్యార్థులతో వ్యాయమ ఉపాధ్యాని భారతి విద్యార్థులతో యోగా, ఇండోర్ గేమ్స్ ఆడించారు. ఈ సమ్మర్ క్యాంపుకు పట్టణం లోని వివిధ స్కూల్ విద్యార్థులు అధిక సంఖ్య లో హాజరయ్యారు. కార్యక్రమం లో లైబ్రెరియన్ సుబ్రహ్మణ్యం, జేమ్స్, రికార్డ్ అసిస్టెంట్ గౌస్, రమణ, సుబ్బమ్మ, పాఠకులు, విద్యార్థుల తల్లి తండ్రులు హాజరుయ్యారు.

మూఢనమ్మకాలను నమ్మి మోసపోవద్దు

ఎర్రగుంట్ల : మూఢనమ్మకాలను నమ్మి ఎవరు మోసపోవద్దు అని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బాల బయన్న పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులలో భాగంగా వినోదం-విజ్ఞానం-వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో బాలబాయన్న మాట్లాడుతూ సైన్స్ ద్వారా జరిగే మ్యాజిక్‌ను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. నీటితోనున్న గ్లాసును జల్లెడపై బోర్లించి నీరు కింద పడకపోవడాన్ని చేసి చూపించారు. ఇందులో ఎటువంటి మహత్యం లేదని ఊర్ధ్వ పీడనం వల్ల నీరు కిందకి పడదని విద్యార్థులకు వివరించారు. అలాగే శరీరానికి మంటలు దిద్దుకోవడం అనేది కూడా ఒక మ్యాజిక్కు అని తెలిపారు. ప్రజలలో విజ్ఞానాన్ని నింపాలనే ఉద్దేశంతో జన విజ్ఞాన వేదిక అహర్నిశలు పనిచేస్తుందని వివరించారు. గ్రంథాలయ రికార్డ్ అసిస్టెంట్ ఉమాదేవి మాట్లాడుతూ ఈ వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులలో కళా ప్రతిభను వెలికి తీయడానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. అజ్ఞానాన్ని విడనాడి విద్యార్థులలో ధైర్యాన్ని నింపేందుకు జెవివి కృషి చేస్తోందని వివరించారు. అవకాశాన్ని విద్యార్థులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జెవివి మండల నాయకులు కె.వి.సుబ్బయ్య, రాంప్రసాద్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మ్యాజిక్ చేసి చూపుతున్న జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి బాల బయన్న

రేపు జెవివి పిల్లల కథ వర్క్‌షాప్

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పిల్లల కథా రచనలు, సృజనాత్మకతను పెంచేందుకు కథా వర్క్‌షాపును కథా వసంతం 2౦25 పేరుతో ఈనెల 24,25 తేదీలలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు జెవివి రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, ఉపాధ్యక్షులు వేంపల్లి రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా కథా వసంతం షెడ్యూల్ పోస్టర్‌ను గురువారం స్థానిక జెవివి కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యక్రమంలో బాల సాహిత్య రచయితలు, కథా రచయితలు పాల్గొంటున్నారని వారు తెలిపారు. మొదటి రోజు కథల్లో మానవ సంబంధాలు అంశంపై బాల సాహిత్య రచయిత డాక్టర్ శ్రీనివాసమూర్తి కథల్లో పర్యావరణ స్పృహ అంశంపై రచయిత దాదాహయాత్ పాల్గొంటారని తెలిపారు. రెండవ రోజు కథల్లో ఉండాల్సిన సామాజిక అంశాలపై రాష్ట్ర తెలుగు భాష పురస్కార గ్రహీత రచయిత పలమనేరు బాలాజీ, కథల్లో తార్కిక దృష్టి పై జెవివి రాష్ట్ర పబ్లికేషన్స్ కన్వీనర్ డాక్టర్ దార్ల బుజ్జిబాబు పప్పెట్ షోను జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు పి విజయ కథల్లో విజువలైజేషన్ అంశంపై రచయిత్రి మాధవి కళ పాల్గొని పిల్లలకు అనేకంశాలపై తర్ఫీదు ఇస్తారని తెలిపారు. ఈ రెండు రోజులపాటు నిర్వహించే కార్యక్రమాలు రచయితలు పి చంద్రశేఖర్, కావూరి మారుతి పర్యవేక్షణలో జరుగుతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని పిల్లలు ఉపయోగించుకోవాలని వారు కోరారుజ కార్యక్రమంలో జెవివి జిల్లా గౌరవ సలహాదారులు గోపీనాథ్ రెడ్డి, నాయకులు ఈశ్వరయ్య, దేవానంద్, హాసిని, జుబేదా గురుచందన, సోయబ్, నరసింహ, సారది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమలాపురం ఎమ్మెల్యే పుతా కృష్ణ చైతన్యరెడ్డి

మహిళలను లక్షాధికారి చేయడమే ధ్యేయం

ప్రజాశక్తి - చింతకొమ్మ దిన్నె : మహిళలను లక్షాధికారి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కమలాపురం ఎమ్మెల్యే పుతా కృష్ణచైతన్యరెడ్డి తెలిపారు. గురువారం చింతకొమ్మదిన్నె సచివాలయ ఆవరణంలో బిసి ఫైనాన్స్ కార్పొరేషన్, ఇడబ్ల్యూఎస్ వారి సహకారంతో మహిళలకు ఉచిత కుట్టు మిషన్ టైలరింగ్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా ప్రజా జనరంజక పాలన అందిస్తున్నారని పేర్కొన్నారు, మహిళలు రాణించని రంగం అంటూ ఏదీ లేదని పేర్కొన్నారు. అనంతరం ఆజాద్‌నగర్‌లోని ఎన్‌టిఆర్ సుజల స్రవంతి మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కుళాయిబాబు, తహశీల్దార్ నాగేశ్వరరావు, ఇఒపిఆర్‌డి వెంకటసుబ్బారెడ్డి, స్థానిక పంచాయతీ సెక్రెటరీ ప్రేమలత, టిడిపి నాయకులు కృష్ణారెడ్డి, మోహన్ బాబు, భాస్కర్ రెడ్డి, రాజారావు, దస్తగిరి, గఫూర్, నాగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు పచ్చజెండా

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్: కేంద్ర ప్రభుత్వం 2022లో మదనపల్లెకు కేంద్రీయ విద్యాలయ మంజూరు చేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు కేంద్రీయ విద్యాలయ ప్రారంభించుటకు కేంద్రీయ విద్యాలయం సంఘటన్ కేంద్ర కార్యాలయం బృందం గురువారం మదనపల్లెలో సందర్శించింది. డిప్యూటీ కమిషనర్ మంజునాథ్, అసిస్టెంట్ కమిషనర్ అనురాధ నేతృత్వంలోని బృందం సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, తహశీల్దార్ ధనంజయులు, ఇతర జిల్లా అధికారులను కలిశారు. ముందుగా సబ్ కలెక్టర్‌ను కలిసి స్థానిక గిరిజన నివాస పాఠశాల భవనంలో ఈ విద్యా సంవత్సరానికి తరగతులు ప్రారంభించడానికి అవసరమైన అన్ని అనుమతులను అందజేశారు. 2025-26 విద్యార్థుల ప్రవేశ ప్రక్రియను త్వరలో పత్రిక ప్రకటన ద్వారా తెలియజేస్తామని కేవీ బృందం ధృవీక రించారు. అబంతరం శాశ్వత పాఠశాల భవన నిర్మాణ కోసం వలసపల్లె గ్రామం వద్ద మదనపల్లి-పుంగనూరు రహదారి ఆనుకుని ఉన్న నవోదయ పాఠశాల ఎదురుగా 6.09 ఎకరాల భూమిని పరిశీలించి ఖరారు చేశారు. సబ్ కలెక్టర్, తహశీల్దార్ ధనంజయులు సమక్షంలో ఈ భూమిని కేంద్రీయ విద్యాలయకు ప్రభు త్వం అప్పగించారు. త్వరలో శాశ్వత భవన నిర్మాణం పనులు ప్రారంభిస్తామని మంజునాథ్ వ్యక్తం చేశారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న హరిప్రసాద్

'లక్ష్మిరెడ్డి వాస్తవాలు మాట్లాడాలి'

ప్రజాశక్తి - కడప అర్బన్

టిడిపిలో సీనియర్ నాయకుడు అని చెప్పుకునే ఆలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి వాస్తవాలు మాట్లాడితే మంచిదని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు హరిప్రసాద్, గోవర్ధనరెడ్డి అన్నారు. గురువారం హరిత టవర్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలో సీనియర్ నాయకుడిని చెప్పుకునే లక్ష్మిరెడ్డి ఏ రోజు పార్టీకి మంచి చేయలేదని, ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీకి వ్యతిరేకంగా పనిచేశారు తప్ప ఇంకోటి చేయలేదన్నారు. పార్టీలు సీనియర్ అయిన ఏ రోజు పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయలేదని తెలిపారు. ఇతర పార్టీలతో కుమ్మక్కు రాజకీయాలు మాత్రమే చేశాడని పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో ఆయన కుటుంబానికి సీటు రాకపోయేసరికి వైసిపికి ఓటు వేయమని ఫోన్‌లో మాట్లాడారని తెలిపారు. టిడిపి ఎమ్మెల్యేను ఓడించడానికి వైసిపి నాయకులతో మాట్లాడిన ఆడియో, వీడియో బయట పెడితే అది మార్ఫింగ్ చేశారని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. నిజమో కాదో ఆయన మనస్సాక్షికే తెలుసు అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఏనాడైనా ఆయన డివిజన్‌లో తెలుగుదేశంకు మెజార్టీ వచ్చిందా లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. లక్ష్మిరెడ్డి చేసిన తప్పులు కప్పిపుచ్చుకోవడానికి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డిని, ఎమ్మెల్యే మాధవిపై నిందలు మోపడం సరికాదన్నారు. తాము పార్టీకి సీనియర్లమేనని అధిస్టానానికి లోబడి పనిచేస్తు న్నామని తెలిపారు. కడప ఎయిర్‌పోర్టులో కడప ఇన్‌ఛార్జి మాధవికి టికెట్ ఇస్తున్నామని చంద్రబాబు నాయుడు ప్రకటించిన వెంటనే ఆమెకు వ్యతిరేకంగా పనిచేసింది పనిచేశారని పేర్కొన్నారు. ఇప్పటికైనా లక్ష్మిరెడ్డి బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు రాంప్రసాద్, కొప్పాల సుబ్బయ్య, కొమ్మలపాటి సురేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

శ్రీనివాసరెడ్డిపై ఆరోపణలు తగవు.. టిడిపిలో సీనియర్ నాయకుడుగా చెప్పుకునే అలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి టిడిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డిపై ఆరోపణలు చేయడం తగవని ఆ పార్టీ నాయకులు, 49వ డివిజన్ ఇన్‌ఛార్జిరాజు సుబ్బారెడ్డి అన్నారు. గురువారం వైఎస్ఆర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. లక్ష్మిరెడ్డి ఇతర పార్టీలతో కుమ్మక్కై రాజకీయాలు మాత్రమే చేశారని పేర్కొన్నారు. లక్ష్మిరెడ్డికి వైసిపితో లోపాయికారి ఒప్పందాలు ఉన్నాయన్నారు. ఆడియో తనది కాదని లక్ష్మిరెడ్డి అలంఖాన్ పల్లెలోని మారెమ్మ గుడి వద్ద ప్రమాణం చేయగలరా అని ప్రశ్నించారు. సమావేశంలో తెలుగుదేశం నాయకులు పి.రాజా, చలపతి, చంద్రబాబు, శివారెడ్డి, బొమ్మిశెట్టి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సర్వేను పరిశీలిస్తున్న ప్లానింగ్ కో-ఆర్డినేటర్ లక్ష్మీ నరసింహ రాజు

చిన్నారుల గుర్తింపునకు సర్వే

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని విభిన్న ప్రతిభావంత చిన్నారులను గుర్తించేందుకు సర్వే చేపడుతున్నట్లు జిల్లా ఎంఎస్ఐ, ప్లానింగ్ కో-ఆర్డినేటర్ లక్ష్మీ నరసింహ రాజు తెలిపారు. గురువారం వేంపల్లెలో జరుగుతున్న సర్వేను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీ నరసింహరాజు మాట్లాడుతూ సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్, ఎంఇఒల ఆదేశాలతో ఈనెల 13 నుంచి జూన్ 10వ తేదీ వరకు విభిన్న ప్రతిభావంతుల సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బడి బయట, 5 సంవత్సరాలలోపు ఉన్న, పాఠశాలలో పేర్లు నమోదు కాని వారిని గుర్తిస్తున్నట్లు పేర్కొన్నారు. వేంపల్లె మండలంలో 8 మంది విభిన్న ప్రతిభావంతులను కొత్తగా గుర్తించామన్నారు. జిల్లాలోని భవిత కేంద్రాలలో విభిన్నప్రతిభావంతుల నమోదు శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలని కోరారు. మండలంలో ఎవరైనా విభిన్న ప్రతిభావంత చిన్నారులు పాఠశాలలో నమోదు కాని వారు ఉంటే భవిత కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. భవిత కేంద్రం ద్వారా అలవెన్స్‌లు, ఆపరేషన్లు, ఉపకరణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐఇఆర్‌టిలు యశోద, సుజాత, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.



జడ్‌పి చైర్మన్, మాజీ ఎమ్మెల్యేను సన్మానిస్తున్న గ్రామపెద్దలు

చర్చి ప్రారంభోత్సవంలో జడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని కూనవారిపల్లె పంచాయతీ పత్తూరులో గురువారం నూతన చర్చిని ప్రారంభించారు. ఈ సందర్భంగా చర్చిని విద్యుద్దీపాలతో అలంకరించారు. క్రైస్తవ గురువులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో జడ్‌పి చైర్మన్ గోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి, వైసిపి జిల్లా జాయింట్ సెక్రెటరీ రాఘవరెడ్డి, కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ ఉపాధ్యక్షులు రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు భూమన సుబ్బారెడ్డి, దుంపలగట్టు సర్పంచ్ రెడ్యం రామకృష్ణారెడ్డి, డిఎల్ శ్రీనివాసులు రెడ్డి, కొత్తపేట సిద్ధారెడ్డి పాల్గొన్నారు.

ఎండియు వాహనాల రద్దు అన్యాయం

- వైసిపి పట్టణ అధ్యక్షుడు జయరామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఇంటింటి వద్దకు రేషన్ సరఫరా చేస్తున్న ఎండియు వాహనాలు రద్దు చేయడం వల్ల ప్రజలకు, వాటి ఆపరేటర్లకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వైసిపి పట్టణ అధ్యక్షుడు జయరామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. వైసిపి కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ రేషన్ లబ్ధిదారులు కూలి పనులు చేసుకునే వారేనని, పనులు మానుకొని రేషన్ షాపు వద్దకు రెండు, మూడు రోజులు తిరగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండియు వాహనాలు ఉంటే పనులు ముగించాక సాయంత్రం వేళల్లో రేషన్ తీసుకునేవారని తెలిపారు. ఎండియు వ్యవస్థలో లోపాలు ఉంటే సరి చేయాలని సూచించారు. వ్యవస్థను రద్దు చేయడం కూటమి ప్రభుత్వానికి తగదని సూచించారు. గత ప్రభుత్వంలో ఉన్న సంక్షేమ పథకాలు ఏవీ అమలు చేయడం లేదని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో అధికారంలోకి అమలు చేయలేదని విమర్శించారు. రేషన్ కార్డులో లబ్ధిదారుల నూతన పేర్లు నమోదు ప్రారంభించి, పత్రాల పేరుతో షరతులు పెట్టి వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఆధార్ ద్వారా రేషన్ కార్డులో పేర్లను నమోదు చేయాలని సూచించారు. స్థానిక సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. ఇటీవల పన్నులు పెంచి ప్రజలపై అధిక భారం వేస్తున్నారని విమర్శించారు. వైసిపి నాయకులపై తప్పుడు కేసులు బనాయిస్తూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణిని ప్రదర్శిస్తుందని విమర్శించారు.

ఘనంగా తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి - దువ్వూరు

భారత్ మాతకీ జై.. వందేమాతరం అంటూ వందల సంఖ్యలో గురువారం మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఆరవేటి హరికృష్ణ, రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. **చక్రాయపేట :** హనుమజ్జయంతి సందర్భంగా చక్రాయపేట మండలంలో గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. వెంకటేశ్వర స్వామి, వీరభద్ర స్వామి ఆలయ చైర్మన్ రామాంజనేయరెడ్డి, మాజీ చైర్మన్ చక్రపాణిరెడ్డి, చెరుకోంపల్లె గంగాధర్ ఆధ్వర్యంలో గండి క్షేత్రం నుండి ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహంతో గ్రామోత్సవం నిర్వహించారు. చెరుకుంపల్లెలో పెద్దినేని చంద్రమౌళి నాయుడు, ఎద్దుల విజయ్‌కుమార్ అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దేవస్థాన మాజీ చైర్మన్ తంగడపల్లి ఓబుల్ రెడ్డి, కర్నాటి హరినాథరెడ్డి, దేవస్థాన కమిటీ సభ్యులు రంగారెడ్డి, పెంచలయ్య, ఈశ్వరయ్య, శ్రీరామ్ మూర్తి, యోగేశ్వర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, టిసి కొండారెడ్డి, టీచర్ నరసింహులు, ఇందుకూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

పుల్లూరు మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి - ఖాజీపేట

పుల్లూరు మాజీ సర్పంచ్ ఇరగంరెడ్డి లక్ష్మీదేవి అనారోగ్యంతో గురువారం రహమత్‌ఖాన్‌పల్లెలో మృతి చెందారు. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేది. లక్ష్మీదేవి మృతి పట్ల గ్రామస్తులు కుటుంబ సభ్యులు సంతాపం తెలిపారు. ఆమె కుమారుడు ఇరుగంరెడ్డి నాగేశ్వర్‌రెడ్డి వైసిపి మండల ముఖ్య నాయకుడిగా కొనసాగుతున్నారు. వైసిపి నాయకులు లక్ష్మీదేవి మృతదేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. పంచాయతీ అభివృద్ధికి ఆమె ఎంతగానో కృషి చేశారని పలువురు కొనియాడారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో వ్యక్తి మృతి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు-ప్రొద్దుటూరు ప్రధాన రహదారి పల్లవోలు సమీపంలో గురువారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో కొత్తపల్లి ప్రభుకుమార్ (41) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని రాజువారిపేట క్రాస్ రోడ్డు వద్ద కొట్టాలకు చెందిన ప్రభుకుమార్ ప్రొద్దుటూరు నుంచి చాపాడుకు ద్విచక్ర వాహనంలో వస్తూ పల్లవోలు సమీపంలోని కాశినాయన ఆశ్రమం ఎదురుగా ఉన్న స్తంభానికి ఢీకొన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెన్నూరు యువకులకు గాయాలు

చెన్నూరు : కడప-కర్నూలు జాతీయ రహదారి శేషయ్యగారిపల్లె వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. చెన్నూరు సిఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నూరుకు చెందిన ఎ.రాజేష్, రాహుల్ ద్విచక్ర వాహనంపై కడపకు వెళుతూ.. ముందు పోతున్న ఐషర్ వాహనాన్ని ఢీకొన్నారు. గాయపడినవారిని 108 వాహనంలో కడప రిమ్స్ తరలించారు. పోలీసుల సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

శాశ్వత కూరగాయల మార్కెట్ ఏర్పాటు కలేనా..!

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

ప్రస్తుతం వనిపెంట రోడ్డులో ఉన్న కూరగాయల దుకాణం

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో కూరగాయల మార్కెట్‌కు స్థల కేటాయింపులు లేకపోవడంతో రైతులు, వ్యాపారులు నానా అవస్థలు పడుతున్నారు. మైదుకూరు మండల పరిధిలో టమోటా, పచ్చిమిర్చి తదితర కూరగాయలు, ఆకుకూరలు రైతులు అధికంగా సాగు చేపడతారు. వాటి విక్రయానికి మైదుకూరు, ప్రొద్దుటూరు ప్రాంతాలకు తరలిస్తుంటారు. మైదు కూరులోని వనిపెంట రోడ్డులో ప్రస్తుతం మార్కెట్ కొనసాగుతోంది. మార్కెట్‌కు ప్రత్యేక స్థలం కేటాయింపు లేకపోవడంతో రోడ్డుపైనే దుకాణాలు ఏర్పాటు చేసుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. అంకాలమ్మ గుడి సమీపంలో రైతులు అమ్మకాలు చేపడుతున్నారు. ఈ ప్రాంతంలో కుళ్లిన కూరగాయలు అధికంగా వేస్తుండడంతో దుర్వాసన వెలువడుతోంది. వర్షం వస్తే పరిస్థితి మరింత అధ్వానంగా తయారవుతోంది. రోడ్డు వెంబడి దుకాణాలు దూరంగా ఉంటున్నాయి. కూరగాయల మార్కెట్‌కు ఒక ప్రదేశంలో స్థలం కేటాయిస్తే ఉపయోగంగా ఉంటుంది. గత ప్రభుత్వంలో పశువుల సంతను గజ్జి తిప్ప వద్దకు తరలించి పశువుల సంత స్థానంలో కూరగాయల మార్కెట్ గదులను ఏర్పాటు చేసేందుకు పనులు ప్రారంభించారు. అవి పూర్తి కాకపోవడం నూతన ప్రభుత్వం అధికారంలోకి రాగానే మళ్లీ సంతను పాత ప్రాంతానికి తరలించారు. ఈ నేపథ్యంలో మార్కెట్ స్థల కేటాయింపు ప్రశ్నార్థకంగా మారింది. మున్సిపాలిటీ పరిధిలో కూరగాయల మార్కెట్‌కు ప్రత్యేక స్థలాన్ని ఏర్పాటు చేసి దుకాణాలను ఏర్పాటు చేస్తే రైతులు, వ్యాపారులు, ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు సూచిస్తున్నారు. కూరగాయల మార్కెట్‌కు స్థలాన్ని కేటాయిస్తే ఉపయోగకరంగా ఉంటుంది. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో మార్కెట్‌కు, ఆటో స్టాండ్ ఏర్పాటు లేదు. ప్రజల మీద మాత్రం మున్సిపాలిటీ పన్ను అధికంగా వసూలు చేస్తోంది. మున్సిపాలిటీ పరిధిలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నాపరాయి పరిశ్రమల అడ్వయిజరీ కమిటీ ఎన్నిక

అడ్వయిజరీ కమిటీ ఎన్నికలో యజమానులు, ఎపిఐఐసి అధికారులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల నాపరాయి పరిశ్రమలకు సంబంధించి ఐపి పార్క్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అడ్వయిజరీ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎపిఐఐసి డిప్యూటీ జోనల్ మేనేజర్ (ఐలా కమిషనర్) కమలాకర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. కమిటీలో జె.లక్ష్మీసుజాత, వై.అంజనమ్మ, జి.పెద్దిరెడ్డి, కె.రామమునిరెడ్డి, వై.రామఓబులరెడ్డితోపాటు మరో ఐదు మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఎపిఐఐసి జోనల్ మేనేజరు కె.శ్రీనివాసమూర్తి, డిప్యూటీ జోనల్ మేనేజర్ పి.కమలాకర్, సర్వేయర్ ఎం.ఎన్.ప్రసాద్‌రెడ్డి కమిటీ సభ్యులుగా ఉంటారు. ప్రస్తుతం వీరు ఆరు నెలల వరకు కార్య నిర్వాహకులుగా ఉంటారు. ఈ లోపు యాజమాన్యం కమిటీని ఎన్నుకుంటుంది. ఇందులో చైర్మన్, వైస్ చైర్మన్ వంటి పదవులు కేటాయించనున్నారు. ఎపిఐఐసి ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ ఎస్టేట్ 43.17 ఎకరాల స్థలంలో 1977లో ప్రారంభించారు. ఇప్పటివరకు ఎపిఐఐసి ఐలా ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేయలేదు. స్థానికంగా ఒక అసోసియేషన్ ఉండేది. మాజీ సర్పంచ్ రవిప్రసాద్ రెడ్డి అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహించేవారు. ప్రస్తుతం ఎపిఐఐసి ఆధ్వర్యంలో నూతన కమిటీ ఏర్పడింది. ఈ సందర్భంగా కమలాకర్ మాట్లాడుతూ స్థానికంగా ఎపి ఐఐసి ఐలా ఆధ్వర్యంలో 68 నాపరాయి యూనిట్లు ఉండగా.. 50 మంది మాత్రమే టాక్స్ చెల్లిస్తున్నారని తెలిపారు. మిగతా 18 మంది కూడా టాక్స్ చెల్లించాలని సూచించారు. ప్రస్తుతం ఏడారికి రూ.2,36,000 టాక్స్ చెల్లిం పులు అవుతున్నాయని మరో రూ.2.5 లక్ష బకాయి ఉందన్నారు. ఎపిఐఐసి ఐలా అకౌంట్లో సుమారు రూ.7 లక్షలు ఉందని తెలిపారు. నూతన కమిటీ వల్ల స్థానికంగా అనేక ప్రయోజనాలు ఉంటాయని వివరించారు. కమిటీ ఆధ్వర్యంలో స్థానికంగా వీధిలైట్లు, పొల్యూషన్, రోడ్లు, డ్రయినేజీ, కనీస వసతులకు సంబంధించి ఏదైనా సమస్యలు ఉంటే ప్రధాన కార్యాలయానికి రాయడం ద్వారా కానీ, కలెక్టర్ దృష్టికి తీసుకెల్లడం ద్వారా గానీ పరిష్కరించుకోవచ్చని తెలిపారు. నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎపిఐఐసి ఐలా సర్వేయర్ ప్రసాద్‌రెడ్డి, సిబ్బంది, నాపరాయి పరిశ్రమల యజమానులు నిడిజి రాజారెడ్డి, వీరారెడ్డి, ముత్తు, రాంప్రసాద్‌రెడ్డి, ప్రసాద్ నాయుడు, కృష్ణారెడ్డి, రామసుబ్బారెడ్డి, మునిరెడ్డి, రమణారెడ్డి, ప్రతాపరెడ్డి, శ్రీను, భాస్కరయ్య, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్యాలయంలో కనిపించని రెవెన్యూ సిబ్బంది



కార్యాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల తహశీల్దార్ కార్యాలయం గురువారం అధికారులు ఎవరు లేకపోవడంతో ఖాళీగా దర్శనమిచ్చింది. అనారోగ్యంతో తహశీల్దార్ శోభన్‌బాబు జూన్ 2వరకు సెలవు పెట్టారు. డిప్యూటీ తహశీల్దార్ యామిని ఆ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం రేషన్ షాపుల తనిఖీ నిమిత్తం ఆమె వెళ్లినట్లు తెలిసింది. మిగతా సిబ్బంది కార్యాలయంలో కనిపించలేదు. పలు సమస్యలతో వస్తున్న ప్రజలు అధికారులు లేకపోవడంతో విసుగుతో వెనుదిరిగారు. ఇటీవల డిప్యూటీ తహశీల్దార్‌కు తాత్కాలిక ఉద్యోగోన్నతులు జరిగాయి. ఇందులో భాగంగా స్థానికంగా ఉన్న డిటి యామిని అన్నమయ్య జిల్లాకు వెళ్లనున్నారు.

అధికారులు లేక ఇబ్బందులు తప్పడం లేదు

భూమికి వన్ బి కావాలని రెవెన్యూ కార్యాలయానికి వచ్చాను. మీ సేవలో వన్ బి రావడం లేదు. అధికారులకు ఫిర్యాదు చేద్దామని వస్తే ఎవరూ లేరు. మండలంలోని చిన్నదండ్లూరు గ్రామం మాది. ఇక్కడి నుంచి సుమారు 20 కిలోమీటర్ల దూరం ఉంది. దూరం అయినందున ఇక్కడికి వచ్చి వెల్లేందుకు ఒకరోజు అంతా పని లేకుండా పోతోంది.

-షరీఫ్, చిన్న దండ్లూరు

నాడు మహా మోసం.. నేడు మహానాడు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఆనాడు మామ ఎన్‌టిఆర్‌ను వెన్నుపోటు పొడిచి మహా మోసం చేసి.. నేడు మహానాడు నిర్వహించడం చంద్రబాబు నాయుడుకే చెల్లిందని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజల సౌకర్యార్థం ప్రవేశపెట్టిన పథకాలన్నిటిని ఒకొక్కటిగా కూటమి ప్రభుత్వం రద్దు చేస్తూ వస్తోందన్నారు. జగన్ పాలనలో అవసరమైన సర్టిఫికెట్లకు దగ్గరలోనే సచివాలయాలు ఉండేవని, ఇంటింటికి తిరిగి ప్రతి 6నెలలకోసారి కొత్త పింఛన్లు మంజూరయ్యేవని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఒకొక్కటిగా ఆ సంక్షేమ పథకాలన్నీ రద్దు చేస్తోందని విమర్శించారు. ఇంటింటికి పోయి రేషన్ ఇస్తే ప్రభుత్వానికి వచ్చే నష్టం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఇంటింటికి తిరిగి చెత్తను సేకరిస్తే ఆ బండి ద్వారా ప్రభుత్వానికి వచ్చే నష్టం ఏంటని అన్నారు. జగన్ పాలన కనిపించకుండా ఉండాలనేది చంద్రబాబు ఉద్దేశమన్నారు. చంద్రబాబుకు ఎందుకు ఓటేసి గెలిపించామా అని ప్రజలు ప్రస్తుతం ఆలోచనలో పడ్డారన్నారు. అమరావతి నిర్మాణం, పోలవరం పూర్తి, పరిశ్రమల రాక ఇలాంటి సొల్లు కబుర్లు చెప్పడం తప్ప రాష్ట్రంలో జరిగింది ఏమీ లేదన్నారు. చేసుకున్న వాళ్లకు చేసుకున్నంత అని పేద ప్రజలు నిట్టూరుస్తున్నారని రాచమల్లు పేర్కొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు

రక్తపోటు పట్ల అప్రమత్తంగా ఉండాలి : డిఎంహెచ్ఒ

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి నాగరాజు

ప్రజాశక్తి - చాపాడు

గర్భిణులు బిపి (రక్తపోటు) పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు సూచించారు. గురువారం స్థానిక పీహెచ్సీలో ప్రీ ఎక్లియాపిసిల్ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ గర్భం దాల్చిన నాటి నుండి 20 వారాలపాటు బిపిని అదుపులో ఉంచుకోవాలన్నారు. ఏదైనా సమస్య ఏర్పడితే పుట్టబోయే బిడ్డపై ప్రమాదం ఉంటుందన్నారు. తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. సిబ్బంది కూడా గర్భిణుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిఐఎఒ ఉమామహేశ్వర్, డిప్యూటీ డిఎంఎస్ మల్లేశ్, మండల వైద్యాధికారి రాజేష్ కుమార్, డాక్టర్ ఓబులేసు, సిబ్బంది, ఎఎన్ఎంలు, గర్భిణులు పాల్గొన్నారు.

ముద్దనూరు : గర్భిణులు ప్రసవ సమయం వరకు జాగ్రత్తలు తీసుకోవాలని పిహెచ్‌సి వైద్యాధికారి నాగార్జున్ సూచించారు. స్థానిక పిహెచ్‌సిలో గురువారం నాగార్జున్ ఆధ్వర్యంలో ప్రపంచ ప్రీ ఎక్లాంసియా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు అవగాహన కల్పించారు. క్రమంగా వైద్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్ యాదవ్, ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, సూపర్‌వైజర్ రామారావు, వైద్య సిబ్బంది ఇందిరమ్మ, ముస్కిన్ బి, ఆశా కార్యకర్తలు నీలవేణి, చంద్రబాయ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైద్యాధికారి నాగార్జున్

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని బైఠాయింపు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

నిరసన వ్యక్తం చేస్తున్న ఖాజా

ప్రొద్దుటూరు అంజుమన్ కమిటీ ఎన్నిక పారదర్శకంగా నిర్వహించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ ఖాజా అన్నారు. ఎన్నిక నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించారని నిరసిస్తూ ఖాజా గురువారం ఇస్లాంపురం మసీదులో బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంజుమన్ కమిటీ ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా కమిటీకి అనుసంధానంగా ఉన్న మసీదుల నుండి ఇద్దరు వ్యక్తులను ఎంపిక చేసి పంపాల్సి ఉందన్నారు. 12వ వార్డు ఇస్లాంపురం మసీదులో ఎన్నికకు అవసరమైన నిబంధనలకు విరుద్ధంగా మసీదులో ఎన్నిక నిర్వహించి ఎలాంటి బహిరంగ ప్రకటన చేయకుండా స్వార్థపూరితంగా వ్యవ హరించారన్నారు. ఇప్పటికైనా బహిరంగ ప్రకటన చేసి పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని ఆయిల్ మిల్ ఖాజా కోరారు.

అవార్డు అందుకుంటున్న సోమేపల్లి అశోక్

సోమేపల్లి అశోక్‌కు 'యోగా ఎక్స్‌లెన్స్' అవార్డు

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటిలో యోగా థెరపిస్టుగా పని చేస్తున్న సోమేపల్లి అశోక్‌కు జాతీయ స్థాయిలో ఎక్స్‌లెన్స్ అవార్డు దక్కింది. యోగాకాన్-2025 సందర్భంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నో నగరంలోని కైసర్‌బాగ్‌లోని గాంధీ భవన్ ఆడిటోరియంలో జరిగిన జాతీయ సదస్సుతో పాటు అవార్డు కార్యక్రమంలో సోమేపల్లి అశోక్‌ను యోగ ఎక్స్‌లెన్స్ అవార్డుతో ఘనంగా సత్కరించారు. రుషికుల్ యోగపీఠ్ ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం యోగా ప్రచార విధానాన్ని ప్రోత్సహించేందుకు, రానున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంగా 2025 సందర్భంగా ఈ అవార్డులను ప్రదానం చేసినట్లు అవార్డు గ్రహీత సోమేపల్లి అశోక్ తెలిపారు. దేశం నలుమూలల నుండి వచ్చిన యోగా నిపుణులు, ఇన్‌స్ట్రక్టర్లు, థెరపిస్టుల మధ్య మానవాళి కోసం చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా అవార్డు దక్కడం గర్వకారణంగా నిలిచిందని తెలిపారు. అవార్డుతో యోగా రంగంలో సేవలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందినట్లు చెప్పారు. విద్యార్థులలో యోగా ద్వారా స్మార్ట్ ఫోన్లను అధికంగా వాడడం తగ్గించి విద్యా విషయాలలో ఆసక్తి పెంచడం అనే అంశంపై ఆంధ్రా విశ్వవిద్యాలయం యోగ విభాగంలో తాను పిహెచ్‌డి పరిశోధన చేస్తున్నట్లు తెలిపారు.

అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పెద్దిరెడ్డి

ఆంజనేయ కొట్టాలులో అన్నదానం

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని ఆంజనేయకొట్టాలు గ్రామంలో హను మజ్జ యంతి సందర్భంగా గురువారం సర్పంచ్ గోపిరెడ్డి పెద్దిరెడ్డి, ఆలయ చైర్మన్ భాస్కర్‌రెడ్డి అన్నదానం చేశారు. సుంకేసులలో వేడుకలు చేశారు. తవ్వారు పల్లెలో ఆలయ చైర్మన్ సందుల నాగశివారెడ్డి, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వ హించారు. **చెన్నూరు :** హనుమజ్జయంతి సందర్భంగా బ్రాహ్మణ వీధిలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయాన్ని మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి సందర్శించారు. స్థానికులు అన్నదానం ఏర్పాటు చేశారు. బుడ్డాయపల్లె ఆలయం వద్ద కూడా అన్నప్రసాద వితరణ చేశారు.

శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ

కడప అర్బన్ : హనుమజ్జయంతి సందర్భంగా నగరంలోని దేవాలయంలో గురువారం టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి అన్నదానం చేశారు. పాత బస్టాండ్ గాలిదేవర ఆంజనేయ స్వామి దేవాలయం, రాజీవ్ మార్కు వద్ద ఆంజనేయ స్వామి దేవాలయం, చలమారెడ్డిపల్లి శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం, రాయచోటి రోడ్‌లో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయాల్లో స్వామివారికి అర్చకులు ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహించారు. అల్మాస్‌పేట అభయ ఆంజనేయ స్వామిని శ్రీనివాసరెడ్డి దర్శించుకున్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మున్సిపల్ కార్మికులకు పెండింగ్ ఉన్న మూడు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమంలో భాగంగా గురువారం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు పురపాలక కార్యాలయం వద్ద నిరసన తెలుపారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ రాజంపేట పురపాలక పరిధిలో 15 మంది బదిలీ కార్మికులకు మూడు మాసాల నుంచి వేతనాలు ఇవ్వలేదని, పలుమార్లు అధికారులు కలిసి విన్నవించుకున్నా బిల్లులు పెట్టాము రావడం లేదని చెప్పడం తప్ప, సమస్య పరిష్కరించిన దాఖలాలు లేవన్నారు. వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని, విరమణ పొందిన కార్మికులకు ప్రతినెలారూ.5 వేలు పింఛన్ మంజూరు చేయాలని, సబ్బులు, నూనె వంటి నిత్యావసర సరుకులు అందజేయాలని కోరారు. కార్మికులకు ఏదైనా ప్రమాదాలు జరిగినప్పుడు ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యానికి రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు ఖర్చు చేసుకుని కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, కార్మికులకు ఇఎస్ఐ సౌకర్యం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి.రమణ, ప్రసాద్, బుజ్జమ్మ, గంగయ్య, సురేష్, ప్రమీల పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు